## క్లుప్తంగా

### ఓటర్ల తుది జాబితా విడుదల



జాబితాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ

అక్కన్నపేట(హుస్నాబాద్): స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ భానోతు జయరామ్ ఆధ్వర్యంలో ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం కొత్తగా ఆరు గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం మొత్తం 37గ్రామాలు ఉన్నాయని చెప్పారు. మండల వ్యాప్తంగా 296వార్డులు ఉండగా అందులో పురుషులు16,469, స్త్రీలు 16,525, మొత్తం 32,994 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్యాలయం సూపరింటిండెండ్ శంకరయ్య, జూనియర్ అసిస్టెంట్లు మల్లేశం శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పంటల పరిశీలన



పత్తిని పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

గజ్వేల్: మండలంలోని పిడిచెడ్, బయ్యారం, ర్యాగట్లపల్లి గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటలను శనివారం తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పంటల్లో ప్రస్తుత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వరి ఈనే దశలో ఉన్నందున తెగుళ్లు వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొక్కజొన్న కత్తెర పురుగు నివారణ, కందిలో ఆకు ముడత, పిందె ముడత, పత్తిలో పిందె రాలడం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ బాబునాయక్, వ్యవసాయాధికారి నాగరాజు, ఏఈఓలు గణేశ్, జ్యోతి, మాధవి, రైతులు పాల్గొన్నారు.


### పోటీ తత్వం అవసరం



జిరాక్స్ మిషన్‌ను ప్రారంభిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శనివారం ఆయన రూ.లక్ష విలువ గల జిరాక్స్ మిషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో పాఠశాలకు మరింత సహాయం అందజేస్తానని చెప్పారు. హెచ్‌ఎం షౌకత్ అలీ, మాజీ సర్పంచ్ పరశురాములు, మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, కనకాంబరం, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

### టీచర్లను డిప్యుటేషన్‌పై పంపొద్దు



వినతిపత్రం చూపుతున్న తల్లిదండ్రులు

వర్గల్(గజ్వేల్): టీచర్లను డిప్యుటేషన్‌పై పంపవద్దని మండలంలోని మైలారం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వారు హెచ్‌ఎం మరుద్వతిదేవికి శనివారం వినతిపత్రం అందజేశారు. సర్దుబాటు పేరుతో ముగ్గురు టీచర్లను డిప్యుటేషన్‌పై పంపితే చదువులు ఎలా సాగుతాయని వాపోయారు. ఇలా అయితే తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

### భూనిర్వాసిత రైతుల వంటావార్పు

వర్గల్(గజ్వేల్): ఫుడ్‌ప్రాసెసింగ్ పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన వర్గల్ భూనిర్వాసిత రైతుల ఆందోళన శనివారం ఆరో రోజుకు చేరింది. పరిశ్రమల ప్రాంతంలో రోడ్డుపై ఆందోళన కొనసాగిస్తున్న రైతులు అక్కడే వంటావార్పు నిర్వహించారు. తమకు పూర్తి పరిహారం, ప్లాట్లు, ప్యాకేజీ అందజేయాలని డిమాండ్ చేశారు. ఆ శిబిరాన్ని రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ బాల్‌రాజు వేర్వేరుగా సందర్శించారు. రైతుల డిమాండ్లను ఉన్నతాధికారులకు నివేదించి పరిష్కారానికి కృషి చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

# నిర్మించారు.. వదిలేశారు

- ఆరేళ్లుగా కూరగాయల మార్కెట్ నిరుపయోగం
- రూ.60లక్షలతో 30షెట్టర్ల నిర్మాణం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్ సముదాయం

దుబ్బాకటౌన్: దుబ్బాకలో పెద్ద చెరువు కట్టపై కూరగాయల మార్కెట్ కోసం నిర్మించిన సముదాయాన్ని పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే రామలింగారెడ్డి హయాంలో రూ.60లక్షలతో ఈ మార్కెట్ కోసం దుబ్బాక పెద్దచెరువు కట్టపై అధికారులు 30షెడ్లను నిర్మించారు. కానీ నిర్మించిన నాటి నుంచి అవి నిరుపయోగంగానే ఉన్నాయి. దీంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. రాత్రిపూట మద్యం తాగి బాటిళ్లు అక్కడే వదిలేస్తున్నారు. దీంతో వాకింగ్‌కు వెళ్లే వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నిధులు దుర్వినియోగం**

ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో చాలామంది యువకులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద దుకాణాలను ఎక్కువ కిరాయికి తీసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కొంతమంది తోపుడు బళ్లపై వ్యాపారాలు చేసుకుంటున్నారు. చెరువుకట్టపై గల 30షెడ్లకు మరమ్మతులు చేయించి చిరు వ్యాపారులకు కిరాయికి ఇచ్చి సముదాయాన్ని వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

> **త్వరలోనే వినియోగంలోకి..**
>
> 
>
> దుకాణ సముదాయాన్ని త్వరలోనే వాడుకలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. మున్సిపల్‌కు అప్పగించాలని మార్కెట్ కమిటీకి ప్రతిపాదనలు కూడా పంపించాం. ఆ నివేదిక రాగానే నిర్ణయం తీసుకుంటాం.
>
> – రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక



దర్శనమిస్తున్న మద్యం బాటిల్

# టీచర్ల సర్దుబాటు జీఓను రద్దు చేయాలి




చిన్నకోడూరు(సిద్దిపేట): నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

**ఎస్టీటీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి నర్సింహాచారి**

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/అక్కన్నపేట(హుస్నాబాద్)/మిరుదొడ్డి(దుబ్బాక): టీచర్ల రేషనలైజేషన్ జీఓ 25ను ప్రభుత్వం వెంటనే ఉప సంహరించుకోవాలని ఎస్టీటీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి నర్సింహాచారి డిమాండ్ చేశారు. జీఓ 25ను వ్యతిరేకిస్తూ శనివారం చిన్నకోడూరు ఉన్నత పాఠశాల ఆవరణలో నల్లా బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి రేషనలైజేషన్ జీఓ 25 పూర్తిగా అశాస్త్రీయమైనదని, 60 మంది విద్యార్థులకు ఇద్దరు, 90 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఉండాలనే నిబంధనను తీసివేయాలన్నారు. ప్రతి తరగతికి ఒక టీచర్, ఒక పీఎస్‌కు హెచ్‌ఎం ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీటీ ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. నంగునూరులో సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం మండలాధ్యక్షుడు బాలకిషన్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్, జయపాల్‌యాదవ్, వీరారెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు. అలాగే బెజ్జంకి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయల ఐక్య సంఘాల నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో వెంకటప్రవీణ్ కుమార్, శంకరాచారి, రవీందర్, మాలతి, రజనీష్ నిరసన వ్యక్తం చేశారు. అక్కన్నపేట ప్రాథమిక పాఠశాల వద్ద ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. మిరుదొడ్డిలో యూటీఎఫ్ నాయకులు కృష్ణ, బద్దిరాజు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ చూపిన మార్గంలో పయనిద్దాం

**ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నేత సంజీవ్**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక)/బెజ్జంకి(సిద్దిపేట)/జగదేవ్‌పూర్(గజ్వేల్): స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ చూపిన మార్గంలో యువత పయనించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం భగత్‌సింగ్ 117వ జయంతి ఉత్సవాలలో భాగంగా ప్రశాంత్‌నగర్‌లోని భగత్‌సింగ్ విగ్రహానికి యువజన, విద్యార్థి సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ యువత భగత్ సింగ్ గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అభిషేక్, భాను, శ్రీకాంత్, రమేశ్, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాలకృష్ణ, ఎర్త్ ఫౌండేషన్ ప్రతినిధులు సరిత, నవిత, విద్యార్థులు పాల్గొన్నారు. బెజ్జంకిలో ఏఐవైఎఫ్ నాయకులు భగత్‌సింగ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు శ్రవణ్, చరణ్, సతీశ్, నరేశ్, అనిల్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధపార్టీల నాయకులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ్ సిద్దిపేటను సాధిద్దాం

**మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్**

సిద్దిపేటజోన్: సమష్టి సహకారంతో స్వచ్ఛ్ సిద్దిపేట సాధిద్దామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహీ సేవలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య వాహనాల డ్రైవర్లకు శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి, హానికర చెత్త గురించి వివరించారు. స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ పోటీలను బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు అన్వేష్, వనిత, సతీశ్, మాధవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న కమిషనర్

## గురుకులంలో ఆర్డీఓ తనిఖీ

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆర్డీఓ రామ్మూర్తి శనివారం తనిఖీ చేశారు. భోజనశాల, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణను పరిశీలించారు. నీటి సరఫరా, సౌకర్యాల నిర్వహణ తీరు గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ సురేఖ తదితరులు ఉన్నారు.

## స్వచ్ఛతలో ముందుండాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్**

హుస్నాబాద్‌రూరల్: స్వచ్ఛతలో మున్సిపాల్టీని ముందు నిలపడానికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత పిలుపునిచ్చారు. డంపింగ్‌యార్డు వద్ద నవభారత్ విద్యార్థులకు వర్మీ కంపోస్టు తయారీ గురించి శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను వాడొద్దన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్ నళినీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రవేశాలకు గడువు

దుబ్బాకటౌన్: ఇంటర్మీడియెట్ మొదటి యేడాది ప్రవేశాల గడువును అక్టోబర్ 15వరకు పొడిగించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు ఉచితం అని, ప్రైవేట్ కళాశాలలో రూ.500 ఆలస్య రుసుం చెల్లించాల్సి ఉంటుందని సూచించారు.

## విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలో వివిధ చోట్ల చెట్లకొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముర్షద్‌గడ్డ, కాంచీట్ చౌరస్తా, పుట్టపర్తి సాయిబాబా, గణేశ్‌నగర్ హనుమాన్ ఆలయాల ప్రాంతాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## కుక్కల దాడిలో పది మేకపిల్లల మృతి

గజ్వేల్: గజ్వేల్ మండలంలోని రిమ్మనగూడ గ్రామంలో శనివారం జరిగిన కుక్కలదాడిలో పది మేకపిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన భీమొల్ల మల్లయ్య తన కొట్టంలో ఉంచిన మేకపిల్లలపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. నాలుగు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆరు మేకపిల్లలు తర్వాత మృత్యువాతపడ్డాయి.

# మార్క్సిజంతోనే సమ సమాజ స్థాపన

**సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి**



మాట్లాడుతున్న మల్లారెడ్డి

చేర్యాల(సిద్దిపేట): మార్క్సిజంతోనే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి చెప్పారు. మండల పరిధిలోని శభాష్ గూడెంలో దాసరి కనకయ్య అధ్యక్షతన శనివారం గ్రామశాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలు, ప్రైవేటీకరణ పేరుతో మానవ మనుగడను హరిస్తున్న కార్పొరేట్ శక్తుల నుంచి ప్రజలను విముక్తి చేసేందుకే సీపీఎం పోరాటం చేస్తోందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై కార్యకర్తలు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గ్రామశాఖ నూతన కార్యదర్శిగా దండ్ల రమేశ్, సోషల్ మీడియా బాధ్యుడిగా ప్రకాశ్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో శశిధర్, వెంకట్ మావో, దేవేందర్‌రెడ్డి, కనకయ్య, శ్రీనివాస్, ఇస్మాయిల్, రంజిత్‌రెడ్డి, బాలు, కొమురయ్య, సంపత్, నగేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు భోజనం సక్రమంగా అందించాలి

**బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌గౌడ్**



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలను శనివారం ఆయన బీఆర్‌ఎస్వీ నాయకులతో కలిసి సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండడం లేదని విద్యార్థులు వారికి తెలిపారు. దీంతో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనంలో నాణ్యత లేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిపాల్ గౌడ్, నరేశ్, శ్రీకాంత్, భాను, రాకేశ్, లింగం, రాజశేఖర్ రెడ్డి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దుబ్బాకటౌన్/కొండపాక(గజ్వేల్)/గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని సిద్దిపేట అర్బన్ మండల విద్యాధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. హెచ్‌ఎం మనోహర్, పీడీ సుజాత, ఉదయశ్రీ, బాల సరస్వతి, ప్రభు, అశోక్ రెడ్డి, మల్లయ్య, వెంకట నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాయపోల్ మండల నూతన విద్యాధికారిగా సత్యనారాయణరెడ్డి, కుకునూరుపల్లి మండల విద్యాధికారిగా బచ్చలి సత్తయ్య బాధ్యతలు చేపట్టారు.

## గుంతలతో చింత

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలో ఎక్కడ చూసినా రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతల రోడ్లతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినప్పటికీ అధికారులు మరమ్మతులు చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. చిన్నకోడూరు బీసీ కాలనీ, చిన్నకోడూరు నుంచి చౌడారం రోడ్డు, రామునిపట్ల రోడ్లు గుంతలతో అస్తవ్యస్తంగా మారాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న చిన్నకోడూరు రోడ్డు

# బెజ్జంకిలో ఈజీఎస్ సామాజిక తనిఖీ

బెజ్జంకి(సిద్దిపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ బాలకృష్ణ వివిధ గ్రామాలలో జరిగిన పనులపై నివేదికలు పరిశీలించారు. రూ.లక్ష జరిమానాతోపాటు రూ.30,697 రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు పని కల్పించాలన్నారు. నెల రోజులుగా గ్రామాలలో జరిగిన పనుల వివరాలు, కూలీల డబ్బులను ఆడిట్‌చేసి ఇచ్చిన నివేదికలో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ స్వామి, ఎంపీడీఓ ప్రవీణ్, ఏపీఓ రాజబాబు, క్యూసీ సంతోష్, పీఆర్ ఏఈ నర్సయ్య, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ బాలకృష్ణ

# విద్యార్థి జీవితం చాలా కీలకం: సీఐ సైదా

గజ్వేల్‌రూరల్/సిద్దిపేటరూరల్: విద్యార్థి జీవితం ఎంతో కీలకమైందని సీఐ సైదా అన్నారు. సెయింట్ జోసెఫ్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు, అలాగే అండ్‌ఆర్‌ఆర్ కాలనీ వాసులకు మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, ఫోక్సో, షీటీమ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే ఓటీపీలు, మెసేజ్‌లకు స్పందించవద్దని చెప్పారు. హెచ్‌ఎం సుష్మ, షీటీమ్ ఏఎస్‌ఐ శ్రీరాములు, కానిస్టేబుళ్లు శ్యామల, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. సిద్దిపేటరూరల్ మండలం రాఘవాపూర్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ శ్రీను, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, షీటీమ్ సిబ్బంది కిషన్, మమత, వీణాకుమారి, ప్రవీణ్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ మందుబాబులకు జరిమానా**

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 27 మంది పట్టుబడ్డారు. వారిని శనివారం కోర్టులో హాజరుపర్చగా రూ.9,200 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

**◆ విద్యార్థులు చదువుల్లో రాణించాలి**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎంఈఓ కృష్ణ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల బాలుర పాఠశాలకు వీఎస్‌ఆర్ ఫౌండేషన్‌కు చెందిన మహేందర్‌రెడ్డి శనివారం మైక్‌సెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దాతల సహకారాన్ని అందిపుచ్చుకుంటూ చదువుల్లో రాణించాలని సూచించారు.

**◆ బ్రిడ్జి నిర్మించాలంటూ నిరసన**

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని కూచనపెల్లి తాళ్ల చెరువువాగుపై బ్రిడ్జి నిర్మించాలని రైతులు వాగులో శనివారం నిరసన తెలిపారు. మాలపల్లి, కూచనపెల్లి గ్రామాల మధ్య రోడ్డు సౌకర్యం లేక రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

**◆ ఎస్సీల అభివృద్ధే లక్ష్యం**

దౌల్తాబాద్(దుబ్బాక): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతమ్‌ను ఆయన నివాసంలో మండల కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అర్హులైన ఎస్సీలకు అన్ని రకాలుగా సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చైర్మన్‌ను సత్కరించారు. నాయకులు శశికాంత్, గణేశ్, రామస్వామి, కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**◆ ఓటరు జాబితాపై ఆర్డీఓ సమీక్ష**

మద్దూరు(హుస్నాబాద్): ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై జనగామ ఆర్డీఓ కొమురయ్య శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులు వస్తే స్వీకరించి జనవరి ఆరున కొత్త జాబితాను ప్రదర్శిస్తామన్నారు. తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఆర్‌ఐ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**◆ మోతాదుకు మించి పిచికారీ చేయొద్దు**

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు తమ పంటలకు మోతాదుకు మించి మందులు, ఎరువులను పిచికారీ చేయొద్దని ఏఓ వసంతరావు సూచించారు. మండలంలోని ఇటిక్యాల, తిగుల్, జగదేవ్‌పూర్, తిమ్మాపూర్, చాట్లపల్లి, మునిగడప గ్రామల్లోని రైతు వేదికల్లో రైతులకు మందుల పిచికారీపై శనివారం అవగాహన కల్పించారు. సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఈఓలు శరణ్య, సమత, భాను, కిరణ్, ఖలీల్ పాల్గొన్నారు.

**◆ ఎల్లప్పకు స్టార్ ఈఎంటీ అవార్డు**



దుబ్బాకరూరల్: అంబులెన్సులో విధులు నిర్వహిస్తున్న దుబ్బాకకు చెందిన ఎల్లప్పకు ఉమ్మడి జిల్లా స్టార్ ఈఎంటీ అవార్డు అందజేశారు. అత్యవసర సేవల విభాగంలో రోగులకు మంచి సేవలందించినందుకు ఈఎంఆర్‌ఐ ప్రోగ్రామ్ మేనేజర్ జనార్దన్ శనివారం ఈ అవార్డును అందజేశారు.

**◆ పత్తి, ఆయిల్‌పామ్ తోటల పరిశీలన**

సిద్దిపేటఅర్బన్: లింగారెడ్డిపల్లి, ఇమాంబాద్ గ్రామాలలో వరి, ఆయిల్‌పామ్, కంది పంటలను శనివారం మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలను ఆశించే పురుగుల ఉధృతిని అరికట్టడానికి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. అధికారుల సలహాలు పాటించాలని కోరారు.

**◆ క్రీడాకారులు సత్తాచాటాలి**

వర్గల్(గజ్వేల్): బేస్‌బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలో సత్తాచాటాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని వేలూరులో జాతీయస్థాయి టోర్నీలో పాల్గొనే క్రీడాకారుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో శనివారం వారు పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు శ్వేత, కృష్ణ, మధుయాదవ్, ప్రవీణ్‌గౌడ్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

**◆ సీడ్ బాల్స్ తయారీ**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ కోటి సీడ్ బాల్స్ తయారీలో భాగంగా శనివారం 10,800 సీడ్ బాల్స్‌ను తయారు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు గంప శ్రీనివాస్ మాట్లాడుతూ అడవులు అంతరించిపోతున్న తరుణంలో సీడ్ బాల్స్ తయారీ ఆహ్వానించదగిన విషయమన్నారు. వేణు కుమార్, శ్రీనివాస్, కృష్ణవేణి, వాణి, వీరేశం, ఉమారాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

**◆ రాష్ట్రపతి నిలయంలో విద్యార్థులు**

వర్గల్(గజ్వేల్): హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించే అరుదైన అవకాశం వర్గల్ నవోదయ విద్యార్థులకు దక్కింది. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి, సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో శనివారం భారతీయ కళామహోత్సవ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విద్యార్థులు వీక్షించారు. విద్యార్థుల వెంట అధ్యాపకులు విజయకుమార్, సుసాన్ జాన్ ఉన్నారు.

**◆ కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత**

కోహెడ(హుస్నాబాద్): మండలంలోని 27 మందికి సంబంధించిన కల్యాణలక్ష్మి చెక్కులను రైతు వేదికలో తహసీల్దార్ సురేఖ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు ఒక్కొక్కరికీ రూ.1,01,116 చొప్పున చెక్కులు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సురేందర్, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.